# తానొకటి తలిస్తే...?!

అదొక ప్రముఖపత్రికాఫీసు! దానికి గుండెలు అదరగొట్టే సర్క్యులేషన్! సంపాదకుడు గోకేశ్వర్ వుద్దండుడు!. ఆవలించకుండానే ఎలా పేగులు లెక్కిస్తారో... కథని చేత్తో పట్టుకుని తూకం వేసినట్టు కథను అరచేతిలో వుంచుకుని దాని బరువు అంచనావేసి ఆకథ అచ్చుకు నోచుకున్నదా.. లేదానే భవిష్యత్ చెప్పేయగల మేధావి!

'ఛాంగుభళా' పత్రికకు గొప్ప ఫాలోయింగ్ వుంది. రైటరైన ప్రతివాడూ అందులో కథ ఒక్కసారైనా అచ్చయితే చాలు జన్మ తరించి ధన్యమౌతుందని ఫీలవుతూంటారు.

కులం గోత్రం.. ఆడమగ... అనే తేడా లేకుండా అందరు కుటుంబ సమేతంగా చదివే ఫామిలీ పత్రికంటే పాఠకలు పడిచస్తారు. ఇది అలాంటిదే!

అందులో సెక్స్ కథలు... రేప్ కథలు... ప్రేమకథలు వుండవ్! కామెడీ కథలకు పెద్దపీట! ఆడవారిని హింసించే సీరియల్స్‌కు ఆ పత్రిక దూరం!

ఏనాడూ పత్రిక విడుదల జాప్యం కాదు!- అధవా... అలా లేటు అయితే మార్కెట్లో కొచ్చే దాకా పాఠకులు రైటర్స్ విలవిల్లాడిపోతారు. వారి హృదయస్పందన ఆగిపోతుంది. పత్రిక కొని చదివే వరకు కడుపు నిండా తిండి కంటి మీద కునుకు వుండదంటే నమ్మండి!-

'ఏమండోయ్ శ్రీవారు' ఓ ప్రముఖ మహిళా రచయిత్రి సీరియల్ టి.వీలో తెలుగు ధారావాహిక సీరియల్‌ల్లాగ నాలుగేళ్ల పాటు 'ఛాంగుభళా' పత్రికలో రావటాన ఆ నవలకు... ఆపత్రికకు ఉత్తర సీరియల్... ఉత్తమ పత్రికగా ఎంపికై బంగారు బహుమతులు గెల్చుకుని చరిత్ర సృష్టించబడిన ఘనత ఆపత్రికది!

ఆరోజెందుకు ఎడిటర్ గారు ఆఫీసుకొచ్చి సీట్లో కూర్చున్నప్పటి నుండి చిర్రుబుర్రులాడుతున్నాడు.

చేతిలో కథను దూరంగ విసిరి 'ఈ కథకు నిప్పెట్టి తగలబెట్టండి..' అనేసి డి.టి.పి ఆపరేటర్‌తో రుద్రరూపం తాల్చి అన్నాడు ఎడిటర్ గోకేశ్వర్.

ఫోర్ పోవాల్సిన బంతిని బార్డర్ లైన్ వద్ద ఫీల్డర్ అద్భుతంగా కేచ్ పట్టినట్టు ఎడిటర్ విసి రేసిన కథను ఒడిసి పట్టుకుని తన హస్త లాఘవాన్ని అత్యుత్తమంగ ప్రదర్శించాడు. డి.టి.పి ఆపరేటర్ అనబడే సబ్ ఎడిటర్ హనుమంతు.

హనుమంతు మాంచి క్రికెట్ ప్లేయరే కాదు మాంచి కమెడియన్ కూడా! వెండి తెరమీద వందకు పైగా సినిమాల్లో హాస్య పాత్రలు ధరించి అలరారిన వాడల్లా తర్వాత రెండేళ్ల పాటు వేషాలు దొరక్క పుడ్డుకి ఇబ్బంది పడవలసి వచ్చిన విషమ ఘడియల్లో.... బావగారికున్న పత్రికాఫీసు గురించని గుర్తుకురాగా... సరాసరి వచ్చేసి 'ఛాంగుభళా' పత్రికలో సబ్ ఎడిటర్ కమ్ డి.టి.పి. ఆపరేటర్‌గా జాయినై సినీమా పరిశ్రమకు శాశ్వతంగా గుడ్‌బై చెప్పేశాడు.

ప్రస్తుతం పత్రికాఫీసులో హనుమంతు కోతి వేషాలేస్తున్నాడు.

ఎడిటర్ గారు కథను విసిరిగొట్టి తగలేయమన్నప్పుడే హనుమంతుకి విషయం బోధపడింది.

జోగినాథం అనబడే ఓ సీనియర్ రైటరు... ఆయనగారు వారానికి పది కథలు రాసి పారేయగల దిట్ట! నోరఫ్! డైరక్ట్ ఫెయిరే! అలా వ్రాయబడిన కథలను పత్రికాఫీసుకు సీరీస్‌గా పంపటానికి అలవాటుపడ్డాడు. ఇంతవరకు ఓ వెయ్యి కథలు పంపగా ఛాంగుభళాలో ఒకటో రెండో అచ్చయినయ్. దట్సాల్! ప్రతి కథకూ తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా గల కవరూ జతపరుస్తుంటాడు. విసుగు విరామం లేకుండా పంపే కథలను చూచి ఎడిటర్‌గారికి చిర్రెత్తుకొస్తుంది. సహనాన్ని కోల్పోయి కథని చదవకుండానే తిప్పి పంపించేస్తుంటాడు.

ఈ సారి ఎడిటర్ గారి కోసం తారాస్థాయి చేరుకోవటంతో విసిరికొట్టబడిందనే వాస్తవాన్ని హనుమంతు గ్రహించిన వాడై... తిప్పి పంపటానికి కవరెట్లాగూ పెట్టాడు కదాని... కథను తగలబెట్టటానికి మనస్కరించక... జోగినాథం ఎక్కడ ఏడ్చిపోతాడో?.... రైలు క్రింద తలపట్టి ఆత్మహత్యకు వొడికట్టచ్చోనని ఎట్టకేలకు ఆకథను కవర్లోపెట్టి తిప్పి పంపాడు!

ప్రతిరోజూ టపాలో వచ్చే వంద కథల్లో పాతిక కథలకు పైగా జోగినాథానివే! అలాంటప్పుడు... విసుగు చెందిన ఎడిటర్ గారికి కోపం రాక చస్తుందా అనుకున్నాడు హనుమంతు.

జోగినాథం రాసే కథల సబ్జెక్ట్స్ పెక్యూలియర్‌గ వుంటయ్!. వంటి మీద... వాలే ఈగ మీదో... కుట్టి చంపే దోమల మీదో... బాత్‌రూమ్స్‌లో తారసపడే బొద్దింకల మీదనో రాసేస్తాడు కథలు. మానవుల మీద జాలిపడే మనసు జోగినాథం రైటర్‌కుందోలేదో గాని... మూగజీవాలైన కీటకాలంటే అత్యంత ప్రేమాభిమానాలు

ఉన్నాయో ఏమో... కాకులమీద కోతుల మీద కూడా కథలు అనేకం రాసి పంపటం ఎడిటర్ గారికి బొత్తిగ నచ్చని విషయం!

ఈనాటి కోపానికి అదే కారణం కాబోలు అనుకున్నాడు హనుమంతు. జోగినాథం ఎంత రైటర్రైతే మాత్రం ఇన్ని వందల కథలు ఎలా రాయగలుగుతున్నాడో? ఎడిటర్ గారి వూహకు అందలేదు.

'సార్... జోగినాథంగారు సీనియర్ సిటిజన్ సార్. షుమారు డెభైపై బడి వుంటుందాయన వయస్సు. రైటర్ గారి వయసుకైనా మనం గౌరవం ఇవ్వాలి సార్...' ఎడిటర్ గారిని సమీపించి అన్నాడు హనుమంతు.

'అయితే ఏంటిట? రెమ్యూనరేషన్ కొరకో... పోటీలు పెట్టినప్పుడు కేవలం బహుమతి కోసమో..పేరుకోసమో కథలు రాసేవారంటే నాకు పరమ అసహ్యం! రోత! కమిట్‌మెంట్ లేకుండా రాసేవాడు రైటరే కాదయ్యా నాదృష్ఠిలో! ఊసుబోక కథలు రాసిపారేద్దామనుకునే వారిలో... ఇదిగో... జోగినాథం కూడా ఒకడు! కథ నచ్చితేనే అచ్చేస్తాం! లేకుంటే చించి చెత్త బుట్టలో పడేస్తాం!... వెనుకటి రోజుల్లో అయితే ఏరైటరైనా ఏడాదికి ఒకటో రెండో కథలు రాసేవారు. ఇప్పుడు వందల కొద్దీ... సారీ... టన్నుల కొద్ది రాసేస్తున్నారు. విడ్డూరంగా కాదా హనుమంతూ ఈనాటి రైటర్స్ ధోరణి?'

'అవున్సార్... మీరనేది నిజమే!' వంతపాడి ఎడిటర్ మాటలకు తాళం వేశాడు హనుమంతు.

× × × × ×

కేంటీన్లో లంచ్ చేసొచ్చిన గోకేశ్వర్ తన కేబిన్లో కూర్చుని టూత్‌పిక్‌తో పళ్లుకుట్టుకుంటున్నాడు

ఇంతలో స్ప్రింగ్ డోర్స్ తెరచుకుని ఓ వ్యక్తి సడన్‌గ లోపలికి ఎంట్రీ ఇవ్వటం వల్ల తలెత్తిచూశాడు.

'నమస్కారం సార్!... నా పేరు 'లకుముకి'... ఆఫ్‌కోర్స్ అది నా కలం పేరనుకోండి! నాకు మరో పేరు కూడా వుంది. 'చెకుముకి' ఇదీ పెన్నేమే! ఒక పేరుతో కథలు రెండో పేరుతో నవలలు రాసిపారేస్తుంటాను రెండు చేతులతో. నా మూడో పేరు 'అగ్ని శిఖ' ఈ కలం పేరుతో కవితలు రాస్తూంటాను. నేను అదో టైపులెండి...' తనను తాను పరిచయం చేసుకుని ఎడిటర్ గారు ఛైర్ ఆఫర్

చెయ్యకముందే కుర్చీలో ఠీవిగ కూర్చున్నాడు. సోకాల్డ్ ట్రిపుల్ నేమ్డ్ రైటరు.

'తమరి అసలు పేరేమిటో? అసలు పేరేదైనా వుందా.... వున్నవన్నీ కలం పేర్లేనా...?-' గోకేశ్వర్ మాటల్లో వెటకారం ధ్వనించింది.

'ఎడిటర్ గారు చమత్కారులే! అసలు పేరు వరాహగిరి అవతారం!-'

'మీ పేరే బాగుంది ఆ కలం పేర్ల కంటే...'

'సార్! నేను రైటర్నే అయినా పత్రికాఫీసుల చుట్టూ ప్రదక్షిణాలు చేసే అలవాటు లేదు. సంపాదకులను కాకాపట్టటం... పార్టీలు ఆరేంజ్ చేయటం వంటి వెధవ పన్లకు నేను పూర్తి వ్యతిరేకిని! అచ్చయిన కథలకు...' రచనలకు పారితోషికం ఇవ్వక పోయినా బాధపడను సార్! అసలు విషయానికొస్తాను. ఇప్పటికి మీ పత్రికాఫీసుకు రమారమి నాలుగు వందల కథలు... పాతిక నవలలు... నూటికిపైగా కవితలు పంపివుంటాను. మా అంకుల్ అపొజిషన్ పార్టీ లీడరండీ! మీ పత్రికకు ఎన్ని రచనలు పంపినా అచ్చు వేయకపోవటం గురించి ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో అంకుల్ చేత పాయింట్ లేవనత్తించాలనుకున్నాను- కానీ.. ముందుగా మిమ్మల్నొకసారి కలిసి... మీతో మాట్లాడి ఒక నిర్ణయానికి రావటం బాగుంటుందని ఇలా వచ్చాను...' గుక్క తిప్పుకోకుండా బుల్లి రాజకీయ ఉపన్యాసం దంచాడు వరాహగిరి అవతారం!

'బ్యాడ్... వెరీ బ్యాడ్...' ఎడిటర్ గోకేశ్వర్ పెదవి విరిచాడు.

'ఏమిటి సార్ బ్యాడ్?- నా రచనలు మీకు పంపటమా?- మీరు వాటిలో కొన్నింటినైనా అచ్చువేయకపోవటమా?- లేకవాటిని మీరు చదివే ప్రయత్నం చేయక రచనలను చెత్త బుట్ట పాలు చేయటమా?-'

అమ్మో! ఈ రైటర్ గాడు అసాధ్యుడే కాదు.. అఖండుడిలా వున్నాడని అనుకున్న గోకేశ్వర్ బుర్ర గోక్కున్నాడు.

'కథలు ఎలా వుండాలీ... మీ రచనలు ఎలా వున్నాయ్ అనే విషయాన్ని గురించి చర్చింటానికి ఈ ఆఫీసు వేదిక కాదు. మీ రచనలేవీ చదివిన గుర్తు రావటం లేదు. అయినా మీరు హామీ పత్రం ప్రతి రచనకు జతపరచారో లేదో? తపాలా బిళ్లలు అతికించిన మీ స్వంత చిరునామా గల కవర్ మీ రచనలకు జత చేశారో లేదో? మీ హేండ్ రైటింగ్ మాకు అర్థమయ్యే రీతిలో వుందోలేదో?... డి.టి.పి చేయించి రచనలెందుకు పంపలేదో?...'

'సార్... సార్ అన్ని ప్రశ్నలతో వేధించకండి!'

'అవును రైటరూ... మా పత్రికలో ఇంతవరకు ఒక్క రచన అయినా అచ్చైనట్టు గుర్తుకు రావటం లేదే?- పోనీ మీరైనా వివరాలు చెప్పగలరా?....'

'అయ్యా ఆలిండియా రేడియోలో వుత్తరాల శీర్షిక ప్రోగ్రాంలాగ మీరు అన్నీ ప్రశ్నలే వేసి నన్ను వాయించేస్తున్నారు....'

రైటర్‌కి ఓర్పు అవసరం పెన్ నేమ్స్ రైటరూ! అది లేనివాడు రచయిత కాలేడు.'

'సార్ నన్ను మీరు కన్ఫ్యూజ్ చేస్తున్నారు. నాగొప్పతనం మీరెరుగరు. అర్ధగంటలో ఆరుపేజీల కథ అలవోకగా ఏకబిగిన రాయగల దిట్టను! మీకంత డౌటుంటే నాకు టెస్ట్ పెట్టండి. మీరిస్ట్ వాచ్‌లో టైమ్ చూచుకోండి సరిగ్గా ముప్పై నిముషాల్లో ఇక్కడికిక్కడే కథరాసి మీ దోసిట్లో పెట్టే అవకాశం నాకివ్వండి! చూపిస్తా నా తఢాకా...' స్వంత డబ్బా కొట్టుకుని పగలబడి నవ్వాడు.

'ఓరి వీడి చాదస్తం కూల... వీడెక్కడ దొరికాడండీ బాబూ! నా ప్రాణాలు తోడేస్తున్నాడు. నావిలువైన కాలాన్ని రాహువులాగ మింగేస్తున్నాడు... అనుకున్నాడు గోకేశ్వర్ మనసులో..'

'సార్! ఎడిటర్ మహాశయా... నేను దమ్మున్న రైటర్ని. అల్లాటప్పారైటర్‌ను కాను...'

'అవునా?... నిజమా?...' వెటకారంగా అన్నాడు.

'సార్! మీ మాటల్లో వెటకారం ధ్వనిస్తోంది. వెటకారం దావాలనమై నా హృదయాన్ని దహించివేస్తోంది. నన్నంత తేలిగ్గా తీసి పారేయకండి! మా అంకుల్ ఇప్పుడు అప్పొజిషన్లో వున్నాడు గానీ... రూలింగ్ పార్టీ పగ్గాలు చేతబూని అయిదేళ్లు సి.ఎంగా రాష్ట్రాన్ని ఏక చత్రాదిపత్యంగ ఏలి..: కోటాను కోట్లు తిమింగలంలా గుటకాయ స్వాహా చేశాడు. అప్పట్లో పత్రిక నడుపుదామని.... అర డజను టి.వీ. స్టేషన్లు ఏర్పాటు చేద్దామంటూ నేను మొత్తుకున్నా విన్లేదు. నామాట విని వున్నట్టయితే మా పత్రికలోనే వారానికో కథ... ఏడాదికో సీరియల్ అచ్చైవుండేవి! గోల్డెన్ ఛాన్స్ మిస్సైంది!

రైటర్ గారూ! ఎందుకొచ్చిన కంటశోష?- మీసుత్తి ఆపి తమరు దయచేస్తే రాబోయే సంచికకు నేను ఎడిటోరియల్ రాసుకునే కాలం వృధా కాకుండా

వుంటుంది!

ఇహ అక్కడితో కిక్కురుమనకుండా కూర్చున్నవాడల్లా లేచి వెళ్లిపోయాడు బహుళ కలం పేర్లు గల రైటర్ మహాశయుడు.

ఇవ్వాళ బయల్దేర బోతూ ఎవరి ముఖం చూశానో గానీ నా ప్రారుబ్ధ ఖర్మ ఇలా కాలింది. అనేసి తనను తాన తిట్టుకున్నాడు దిగ్రేట్ ఎడిటర్ గోకేశ్వర్.

× × × × ×

గోకేశ్వర్‌కొక బలహీనత వుంది! అది పరమ సీక్రేట్! ఎవ్వరికీ తెలీదు. తన అవసరాలకు ఇతరులను గోకుతాడు... వాళ్ల చేత గోకించుకోగల యుక్తి పరుడు! అల్లాటప్పావారితో జాగ్రత్తగా వుంటాడు. స్కిల్ గేమ్స్ అతి చాకచక్యంతో ఆడగలడు.

చీకటి పడితే చాలు ఆటోలో ముడేసుల బార్లో ఎవ్వరూ తనను గుర్తించకుండా ఓకార్నర్ సీట్‌లో సెటిలైపోతాడు. పీపాలాంటి పొట్ట నిండేవరకు విస్కీ లాగిస్తాడు. చికెన్ బిర్యాని అవు రావురమంటూ మెక్కేస్తాడు. చివరగా ఆడవాసనను అఘ్రాణించే ఏర్పాటు స్టార్ హోటల్లో ఆరెంజ్ చేయించుకుంటాడు.

పై మూడూ ఆఫర్ చేస్తే చాలు. క్యాష్ డీలింగ్స్‌కు మాత్రం కక్కుర్తిపడడు!

ఇతగాడి బలహీనత రహస్యంగ హనుమంతు వాసనపట్టాడు. అంతటితో వూరు కోని హనుమంతు ప్రెస్‌మీట్ అరెంజ్ చేసి తన పేరు బైటికి రాకుండా 'ఛాంగుభళా' పత్రిక ఎడిటర్ గోకేశ్వర్ గురించిన రాసలీల కార్యక్రమాల వివరాలు ఎవిడెన్స్‌తో సహా వివరించాడు.

హనుమంతు తనను గోకేశ్వర్ లెక్క చేయకపోవటం తననొక ఈగ దోమకంటే హీనంగా చూడటమే ఈ ప్రేరణకు కారణం!

ఈవిధంగా ఎంతో కాలంగా గోకేశ్వర్ ఎడల వున్న కక్ష తీర్చుకోగలిగి నందుకు తెగ సంబరపడ్డాడు.

ఈ విషయం టి.వి. ఛానళ్లు ప్రచారం చేయటం పత్రికలు తన ఫోటోతో సహా కూడిన వివరాలను హెడ్‌లైన్సులో రాయటం చూచాక గోకేశ్వర్ గుండె చెరువైంది.

తెల్లవారి ఆఫీసుకెళ్లాగానే తన టేబులు పై వున్న డిస్మిసల్ ఆర్డర్స్ చూచి లబోదిబోమన్నాడు.

(సమాప్తం)